

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు గజమాలతో స్వాగతం

జవాబుదారీ ప్రభుత్వాన్ని ఎన్నుకోండి

ఎన్నికల సంగ్రామంలో సమష్టిగా పోరాడుదాం

సమరయోధుల స్ఫూర్తితో ముందుకెళదాం

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

వడ్డె ఓబన్నకు నివాళి

హిందూపురం, ఫిబ్రవరి 9: వచ్చే ఎన్నికల్లో జవాబుదారీ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని ప్రముఖ సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ.. ప్రజలకు సూచించారు. పట్టణంలోని శ్రీకంఠపురం సర్కిల్‌లో ఇటీవల ఆవిష్కరించిన వడ్డె ఓబన్న విగ్రహానికి ఎమ్మెల్యే శుక్రవారం పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రేనాటి స్వాతంత్ర్య సమరయోధుడు, వడ్డెర జాతికి ఆరాధ్యదైవమైన వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. ఓబన్న త్యాగఫలం ఎప్పటికీ మరవలేనిదన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితో ఎన్నికల్లో సమష్టిగా పోరాడదామని పిలుపునిచ్చారు. కొందరి చరిత్రలు వెలుగు చూస్తాయనీ, మరికొందరివి మరుగున పడతాయన్నారు. యువత.. చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అప్పట్లో ఎన్టీఆర్.. వడ్డెర్ల కోసం కాంట్రాక్టు పనుల్లో 30 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. వైసీపీ పాలనలో ఎవరికీ న్యాయం చేకూరలేదన్నారు. దీంతో జవాబుదారీ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను వడ్డెర సంఘం నాయకులు కొల్లకుంట అంజినప్ప, నవీన్, రంగప్ప, హనుమయ్య, కౌన్సిలర్ మంజుల తదితరులు ఘనంగా సత్కరించారు. సుత్తెను బహూకరించి, భారీ గజమాలతో స్వాగతం పలికారు.



వడ్డె ఓబన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే

ఇలా.. అయిందేందప్పా..!



ఉలిక్కిపడ్డ వైసీపీ

- టీడీపీలోకి కౌన్సిలర్, నాయకుల చేరికతో తీవ్ర చర్చ
- సొంత పార్టీ అసమ్మతి నాయకులపై ఆరా
- ఆగమేఘాల మీద ప్రెస్‌మీట్
- పోలీసులను కాదని.. నిఘావర్గాలకు ఆదేశాలు
- రహస్య నివేదిక ఇవ్వాలని జిల్లా అధికారికి రాష్ట్ర నేత హుకుం

హిందూపురం, ఫిబ్రవరి 9: పురం వైసీపీలో ఒక్కసారిగా ఉలికిపాటు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నియోజకవర్గ పర్యటన చేపట్టడంతో వైసీపీకి అనుకోని ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. వైసీపీ నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. దీంతో వైసీపీ కీలక నేతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లు చర్చ సాగుతోంది. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా దీపికను నియమించిన తరువాత ప్రతి సమావేశంలో అధికార పార్టీ నేతలు 'హిందూపురం టీడీపీ కంచుకోటను బద్దలు కొడతామనీ, బాలకృష్ణకు డిపాజిట్ రాకుండా చేస్తామనీ, ఆ పార్టీని ఖాళీ చేస్తామంటూ' గొప్పలు చెబుతున్నారు. ఇటీవల నియోజకవర్గ పర్యటనకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వచ్చేముందు ఆయన సమక్షంలో టీడీపీకి చెందిన కార్యకర్తలు, నాయకులు వేలాదిగా వైసీపీలో చేరతారని చెప్పుకొచ్చారు. ఇదే విషయాన్ని వారు అనుకూల పత్రికల్లో కూడా రాయించుకున్నారు. ఆయన నియోజకవర్గ పర్యటన పంచాయతీల వారీగా ముగిసింది. టీడీపీ నుంచి ఒక్కరూ వైసీపీలో చేరలేదు. దీంతో వారి ఆశలు అడియాసలయ్యాయి. హిందూపురం నియోజకవర్గానికి రెండురోజుల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సమక్షంలో అధికార పార్టీకి చెందిన మున్సిపల్ కౌన్సిలర్‌తోపాటు సుమారు 300 మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారు పార్టీని వీడతారని ముందురోజు వరకు వైసీపీ గ్రహించకపోవడం గమనార్హం. అధికారంలో ఉన్నామనీ, తమను కాదని పార్టీని వీడేది ఎవరని అనుకున్నారో.. ఏమో కానీ, వారి అంచనాలను తల్లకిందులు చేస్తూ టీడీపీలోకి చేరడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే తేరుకున్న వైసీపీ ముఖ్యనేతలు మరుసటిరోజే శుక్రవారం కొంతమంది ఆ పార్టీలో ఉన్న అసమ్మతి నాయకులను పిలిచి వారితోనే విలేకరుల సమావేశం ఏర్పాటు చేయించారు.

నిఘావర్గాలకు ఆదేశాలు

హిందూపురం నియోజకవర్గంలో అధికార పార్టీలో మొదటి నుంచి కుమ్ములాటలు కొనసాగుతూనే ఉన్నాయి. అవి ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ముదిరి పాకాన పడ్డాయి. ఈ పరిస్థితుల్లో చాలామంది వైసీపీ నాయకులు పార్టీ మారేందుకు పక్కచూపులు చూస్తున్నట్లు తెలుస్తోంది. దీనికితోడు రాష్ట్రంలో వైసీపీలో నెలకొన్న అనిశ్చితి బయటికి వస్తున్న సర్వేలపై అధికార పార్టీలో కొంతమంది అక్కడ ఉండటం కంటే మరోచోటికి వెళ్లడమే మేలని భావిస్తున్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో వలసలు భారీగా ఉంటాయని టీడీపీ నాయకులు బహిరంగంగా చెప్పుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అధికార పార్టీలో అసమ్మతి నాయకులు ఎవరున్నారు? టీడీపీతో ఎవరు చట్‌లో ఉన్నారనే విషయాలను పోలీసులతో కాకుండా నిఘావర్గాల ద్వారా తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే నిఘావర్గాలు ఇదే పనిలో నిమగ్నమయ్యాయి. రోజువారీ వైసీపీ నాయకుల కదలికలను తెలుసుకుని ముఖ్య నేతలకు చేరవేస్తున్నట్లు సమాచారం. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలపై నిఘా ఉంచాల్సిన సంబంధిత శాఖలు వైసీపీ అసమ్మతి నాయకుల కదిలికలపై దృష్టి మళ్లించడం ఎంతవరకు సమంజసమని వైసీపీ నాయకులే అంటున్నారు.

రహస్య నివేదికలు కోరిన రాష్ట్ర నేత

హిందూపురం నియోజకవర్గంలో నెలకొన్న వర్గ విబేధాలతోపాటు తాజా పరిణామాలు గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు నాయకుల వ్యవహార శైలి, వారు ఎవరికి టచ్‌లో ఉన్నారు? అనే విషయాలను నివేదిక రూపంలో ఇవ్వాలని జిల్లా అధికారికి రాష్ట్ర నేత ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. బాలయ్య శుక్రవారం మధ్యాహ్నం హిందూపురంలో బయలుదేరే వరకు వైసీపీ నాయకుల్లో అలజడి నెలకొంది. మరి కొంత మంది టీడీపీలో చేరుతారని శుక్రవారం పెద్దఎత్తున ప్రచారం సాగింది. దీంతో ఎప్పటికప్పుడు వైసీపీ అసమ్మతి నాయకుల కదిలికలను ఆరాతీశారు. మరోసారి బాలకృష్ణ వస్తే పార్టీలోకి చేరేవారు ఎవరైనా ఉన్నారా? అనే విషయాలను నిఘావర్గాలు ఆరాతీసి జిల్లా అధికారులకు పంపుతున్నట్లు సమాచారం. ఏది ఏమైనా యుద్ధంలో గెలవాలంటే ప్రత్యర్థి బలాలుబలహీనతలు తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. వైసీపీ ప్రభుత్వంలో సొంత పార్టీ నాయకుల బలహీనతలు తెలుసుకోవడం కోసం ఆలోచించడం కొసమెరుపు. ఇలాంటి పరిస్థితి వైసీపీలో నెలకొనడం దౌర్భాగ్యమని ఆ పార్టీ నాయకులే విమర్శలు గుప్పిస్తున్నారు.



అసమ్మతి నాయకులపై నిఘా

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసీపీలో రోజురోజుకీ అసమ్మతి సెగ అధికమవుతోంది. ఇప్పటివరకు అసమ్మతి నాయకులపై అధికార దర్పం ప్రయోగించి, నయానో.. భయానో దారికి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తూ వచ్చారు. ఎన్నికల కోడ్ అమలైతే పరిస్థితి వేరేలా ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని వైసీపీలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అసమ్మతి నాయకుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని ఆ పార్టీలోని ఓ ముఖ్య నేత కొంతమంది అనుయాయులకు ఆదేశాలిచ్చారు. అసమ్మతి నాయకులు ఎవరైనా టీడీపీ టచ్‌లోకి వెళ్లారా? వారు పార్టీలో తటస్థంగా ఉంటారా? అనే వివరాలను ఎప్పటికప్పుడు తెలపాలని కొంతమందికి సూచించారు. అసమ్మతి ఎందుకు ఉంది? వారిలో నెలకొన్న అభద్రతాభావం ఎందుకు ఉంది? వారికి ఏమి చేస్తే పార్టీకి పని చేస్తారు? అనే విషయాలను తెలుసుకుంటున్నారు.



మట్టి తరలింపునకు వచ్చిన వాహనాలు

పేట్రేగిపోతున్న మట్టి మాఫియా

- యథేచ్ఛగా తవ్వకాలు
- అడ్డుకున్న రెవెన్యూ అధికారులు
- చర్యలకు వెనుకంజ

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 9: సోమందేపల్లి మండలంలో అధికార పార్టీ అండతో మట్టి మాఫియా పేట్రేగిపోతోంది. మండలంలోని సాకిరేవుకొండ నుంచి శుక్రవారం దాదాపు పది ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌తో మట్టి తరలిస్తున్నారు. సమచారం అందుకున్న రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమి నుంచి అనుమతులు లేకుండా మట్టి ఎలా తరలిస్తారంటూ వీఆర్వో నాగరాజు నిలదీశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఆయన తెలిపారు.

గ్రూపు రాజకీయాలతో గుట్టు రట్టు

అధికార వైసీపీలో గ్రూపు రాజకీయాలతో సోమందేపల్లిలో మట్టి అక్రమ తరలింపు గుట్టురట్టయింది. ఓ వర్గానికి చెందిన నాయకుల అండతో సాకిరేవుకొండలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. దీనిని జీర్ణించుకోలేని మరోవర్గం రెవెన్యూ అధికారికి సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఆ అధికారి పుట్టపర్తిలో జిల్లా అధికారుల సమావేశంలో ఉన్నా.. స్థానిక వీఆర్వో నాగరాజుకు సమాచారం అందించి, అడ్డుకున్నారు.

చర్యలకు వెనుకంజ

నిబంధనల మేరకు మట్టి తరలించాలంటే రెవెన్యూ అధికారుల అమనుమతితోపాటు రాయల్టీ చెల్లించాల్సి ఉంది. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తూ పట్టుబడితే రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటారు. సామాన్యుడు సొంత అవసరాలకు మట్టి తరలించినా.. కేసు నమోదుచేసి పోలీసు స్టేషన్‌కు వాహనాలు తరలించి ముప్పతిప్పలు పెడతారు. సాకిరేవుకొండలో పట్టుబడిన మట్టి అక్రమార్కులకు అధికార పార్టీ అండ ఉండడంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సామాన్యులకో న్యాయం, అధికార పార్టీ వారికో న్యాయమా అంటూ మండిపడుతున్నారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించండి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి, ఫిబ్రవరి 9: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు.. యంత్రాంగాన్ని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పొరబాట్లకు తావివ్వకుండా వ్యవహరించడమే పోలింగ్ విధుల్లో ప్రధానమన్నారు. పోలింగ్ సరళిలో చాలా మార్పులు వచ్చాయనీ, వాటిని క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. ఈనెల 21 నాటికి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తిచేసి, నివేదిక పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్వో కొండయ్య, పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్డీఓలు వంశీకృష్ణ, భాగ్యరేఖ, వెంకట శివరామిరెడ్డి, మడకశిర ప్రత్యేకాధికారి గౌరీశంకర్‌రావు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యపై రోడ్డెక్కిన రైతులు

కదిరి, ఫిబ్రవరి 9: అమడగూరు మండలంలోని కందుకూరిపల్లి, మహమ్మదాబాద్, జెకెపల్లికి చెందిన రైతులు.. విద్యుత్ సమస్యపై రోడ్డెక్కారు. నిత్యం కరెంటు కోతలతో పంటకు తడులివ్వలేకపోతున్నామనీ, సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మహమ్మదాబాద్ మూడురోడ్ల కూడలిలో ధర్నా నిర్వహించారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. నల్లమాడ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ అక్కడికి చేరుకుని, విద్యుత్ అధికారులతో మాట్లాడారు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. వీరికి టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయులు నాయుడు మద్దతు తెలిపారు.



మహమ్మదాబాద్‌లో ధర్నా చేస్తున్న రైతులు

పుట్టపర్తిలో బతుకమ్మ..



బతుకమ్మకు పూజలు చేస్తున్న భక్తులు..



బతుకమ్మ ఆడుతున్న భక్తులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 9: పట్టణంలో శుక్రవారం బతుకమ్మతో తెలంగాణలోని ఉమ్మడి నల్గొండ జిల్లా భక్తులు నగర సంకీర్తన నిర్వహించారు. మొదట హనుమాన్ సర్కిల్‌లో బతుకమ్మకు పూజలు చేశారు. బతుకమ్మ ఆడారు. అక్కడి నుంచి నగర సంకీర్తనగా భక్తి పాటలు పాడుతూ బతుకమ్మను ఊరేగింపుగా తీసుకెళ్లారు. నగర సంకీర్తనలో కోలాటం, చక్కభజన ప్రదర్శించారు. సాయికుల్వంత్ మందిరానికి చేరుకుని, సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. శ్రీసత్యసాయి హయ్యర్ సెకండరీ స్కూల్ విద్యాసంవత్సరం ముగింపు సందర్భంగా సాయికుల్వంత్ హాల్‌లో భక్తిగీతాలు ఆలపించారు. సత్యసాయి ప్రేమతత్వంపై మధురగానంతో అలరించారు.

భూమి కోసం కిడ్నాప్

దళిత యువకుడిని ఎత్తుకుపోయిన వైసీపీ నాయకులు

బెదిరించి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు పన్నాగం

డయల్ 100కి బంధువుల ఫిర్యాదు

కాపాడిన పోలీసులు..వివరాలు వెల్లడించేందుకు ససేమిరా



బత్తలపల్లి పోలీస్ స్టేషన్ వద్ద పెద్దప్పయ్య బంధువులు

ధర్మవరం, ఫిబ్రవరి 9: పట్టణంలో వైసీపీ నాయకులు బరితెగించారు. విలువైన భూమిని కాజేసేందుకు ఏకంగా ఓ యువకుడిని శుక్రవారం కిడ్నాప్ చేశారు. బలవంతంగా భూమి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు తీసుకెళ్లగా.. పోలీసులు కాపాడారు. జిల్లాలోని బత్తలపల్లి మండలం గంటాపురం గ్రామానికి చెందిన అక్కిం లక్ష్మయ్యకు ఇద్దరు కుమారులు. ఇటీవల లక్ష్మయ్యతోపాటు చిన్న కుమారుడు సుబ్బరాయుడు మృతిచెందాడు. ఆ కుటుంబంలో పెద్దప్పయ్య మాత్రమే మిగిలాడు. ఆ కుటుంబం పేరిట బత్తలపల్లి సమీపాన జాతీయ రహదారి పక్కనే, టోల్ గేటుకు ఆనుకుని 1.05 ఎకరాల భూమి ఉంది. బహిరంగ మార్కెట్‌లో దీని విలువ రూ.5 కోట్ల వరకు పలుకుతోంది. ఆ కుటుంబంలో మిగిలిన పెద్దప్పయ్యకే ఈ భూమి దక్కుతుంది. ఒంటరిగా ఉంటున్న దళిత పెద్దప్పయ్య నిస్సహాయతను ఆసరాగా చేసుకున్న వైసీపీ నాయకులు, ఆ భూమిని కాజేసేందుకు కుట్ర పన్నారు. గంటాపురానికి చెందిన వైసీపీ ప్రజాప్రతినిధి, బత్తలపల్లి మండలానికి చెందిన మరో ఇద్దరు అధికార పార్టీ నాయకులు పథకం రచించారు. పెద్దప్పయ్య తండ్రి లక్ష్మయ్య ఆ భూమిని వారికి రాసిచ్చినట్లుగా పత్రాలు సృష్టించుకున్నట్లు తెలుస్తోంది. ఎలాగైనా పెద్దప్పయ్యను పట్టుకుని రిజిస్ట్రేషన్ చేయించుకుంటే భూమి సొంతమవుతుందని భావించారు. పెద్దప్పయ్య నాలుగేళ్లుగా బెంగళూరులో ఉంటూ ఫ్యాక్టరీల్లో పనులకు వెళ్తుండేవాడు. రెండు నెలల క్రితమే ధర్మవరం వచ్చి, ఇటుకల బట్టీలో పనికెళ్తున్నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు, రిజిస్ట్రేషన్‌కు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ధర్మవరంలో శుక్రవారం పెద్దప్పయ్యను కిడ్నాప్ చేశారు. ప్రత్యేక వాహనంలో నేరుగా ధర్మవరంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తరలించారు. ఇంతలోనే విషయం బంధువులకు తెలియడంతో వారు డయల్ 100కి సమాచారం అందించారు. అప్రమత్తమైన పోలీసులు, అక్కడికి వెళ్లి పెద్దప్పయ్యను రక్షించారు. భూమి రిజిస్ట్రేషన్ కాకుండా అడ్డుకున్నట్లు తెలిసింది. కానీ పెద్దప్పయ్య ఎక్కడున్నారన్న విషయాన్ని పోలీసులు వెల్లడించట్లేదు. తమకేమీ తెలియదని దాట వేస్తున్నారు. దీన్నిబట్టి పోలీసులపై అధికార పార్టీ ఒత్తిడి ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. పెద్దప్పయ్య బంధువులు అతనికోసం బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విచారించారు. వారికి బాధితుడిని అప్పగించారా, లేదా అన్నది బహిర్గతం కాలేదు. ఈ నేపథ్యంలో కిడ్నాపర్లపై కేసు నమోదు చేస్తారా, అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి నీరుగారుస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లావాసిపై ఎమ్మిగనూరులో హత్యాయత్నం

- ఆర్థిక లావాదేవీలే దాడికి కారణం



కుప్పకూలిపోయిన వీర నారాయణను పరిశీలిస్తున్న పోలీసులు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 9: ఎమ్మిగనూరు పట్టణంలోని కోర్టు రోడ్డులో శుక్రవారం హత్యాయత్నం జరిగింది. అనంతపురం జిల్లా కనగానపల్లి మండలం దాదులూరు గ్రామానికి చెందిన బుట్ట వీర నారాయణపై సీ బెళగల్ మండలం కంబదహాల్(తూర్పు కంపాడు)గ్రామానికి చెందిన కురువ ఈరన్న కొడవలితో విచక్షణారహితంగా దాడిచేశాడు. వీరిద్దరి మధ్య ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. ఓ చెక్ బౌన్స్ కేసులో వీర నారాయణ కోర్టుకు హాజరైన క్రమంలో బయట చెట్టు కింద నిలబడి ఉన్నాడు. అప్పటికే కోర్టు బయట కాపు కాసిన ఈరన్న కొడవలితో వీర నారాయణపై దాడికి పాల్పడ్డాడు. తప్పించుకొని పరుగుతీసేందుకు ప్రయత్నించగా వెంటపడి వీరనారాయణను తలపైన, గొంతుపైన నరికాడు. దీంతో వీరనారాయణ కుప్పకూలిపోయాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రక్తపు మడుగులో పడి ఉన్న వీర నారాయణను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు జీజీహెచ్‌కు తరలించారు. పట్టణ ఇన్‌చార్జి సీఐ మోహన్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పత్తికి బోనస్ ప్రకటించాలి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 9: జిల్లాలో పత్తి క్వింటాకు రూ.2 వేలు బోనస్ ప్రకటించి, రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ఖరీఫ్‌లో దాదాపు 80వేల ఎకరాల్లో పత్తి సాగు చేయగా వర్షాలు సకాలంలో రాకపోవడంతో రైతులు నష్టపోయారన్నారు. రెండేళ్ల క్రితం పత్తి ధర బాగా ఉండడంతో జిల్లాలో రైతులు అప్పులు చేసి మరీ పత్తి సాగు చేశారని, అయితే పత్తి దిగుబడి తగ్గడం, దీనికితోడు మద్దతుధర ఆశించినమేర లేకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో దళారులు సిండికేట్ అయ్యి రూ.5వేల నుంచి రూ.6వేల మధ్య మాత్రమే పత్తి కొనుగోలు చేస్తుండటంతో రైతులకు గిట్టుబాటుకావడం లేదన్నారు. ఈక్రమంలోనే అప్పుల భారం పెరిగి కొందరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, రైతుల వద్ద ఉన్న మొత్తం పత్తిని ప్రస్తుతమున్న ధర క్వింటాకు రూ.7,020కు అదనంగా రూ.2వేలు బోనస్ ప్రకటించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

మూగజీవుల మృత్యుఘోష



- అక్రమంగా మూగజీవాల రవాణా
- రవాణాకు రాచబాట ఎన్‌హెచ్ 44
- తెలంగాణ నుంచి బెంగళూరుకు తరలింపు
- దాడులు మరచిన పోలీసులు, అధికారులు
- పలుచోట్ల పశువుల కంటైనర్లకు ప్రమాదాలు
- మృతువాత పడుతున్న మూగజీవులు

తాడిపత్రి, ఫిబ్రవరి 9: పశువుల అక్రమ రవాణాకు హైదరాబాదు-బెంగళూరు జాతీయ రహదారి(ఎన్‌హెచ్44) రాచబాటగా మారింది. అధికారులు తనిఖీలు చేయకపోవడం వల్ల యథేచ్ఛగా రవాణా జరుగుతోంది. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదాలు జరిగి మూగజీవులు మృతువాత పడుతున్నాయి. పెద్దవడుగూరు మండలం కాశేపల్లి టోల్‌ప్లాజా సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డుప్రమాదమే ఇందుకు తార్కాణం. తెలంగాణ నుంచి బెంగళూరుకు కంటైనర్‌లో తరలిస్తున్న పశువుల్లో 40కిపైగా ఎద్దులు, ఆవులు మృతి చెందగా అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు కూలీలు చనిపోయారు. కంటైనర్‌లో సామర్థ్యానికి మించి పశువులను కుక్కి తరలించడం వల్ల ప్రమాదం తీవ్రత పెరిగింది. గతంలో అనంతపురం నుంచి తాడిపత్రి మీదుగా చెన్నైకు కంటైనర్‌లో తరలిస్తున్న పశువులను తాడిపత్రి బైపాస్ రోడ్డులో బీజేపీ నాయకులు పట్టుకొని పోలీసు అధికారులకు అప్పగించారు. ఈ మధ్యకాలంలో పోలీసు అధికారుల నిఘా కొరవడటం వల్ల కూడా తిరిగి తాడిపత్రి ప్రాంతం నుంచి చెన్నైకు అక్రమంగా పశువుల రవాణా సాగుతోందన్న ప్రచారం ఉంది. వారాంతపు సంతలతోపాటు దొంగిలించి తెచ్చిన పశువులను ఎక్కువగా కబేళాలకు అక్రమంగా తరలిస్తున్నారు.

చెక్‌పోస్టులలో అవినీతితో..

రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్‌పోస్టులు అవినీతికి చిరునామాగా మారాయి. తెలంగాణా రాష్ట్రం సరిహద్దు చెక్‌పోస్టు మహబూబ్‌నగర్, కర్ణాటకకు కొడికొండ చెక్ పోస్టు ఉన్నాయి. నిత్యం ఈ చెక్‌పోస్టుల ద్వారానే పశువుల కంటైనర్లు అక్రమంగా తరలివెళుతున్నా పట్టించుకొనే నాథుడే లేడన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయా చెక్‌పోస్టుల వద్ద పక్క రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేసిన తర్వాతే అనుమతించాల్సి ఉంటుంది. కానీ తనిఖీ అధికారులు కొందరు అవినీతికి పాల్పడుతుండటం వల్ల యథేచ్ఛగా కంటైనర్లు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయి. రవాణా సమయంలో కొందరు ఏజెంట్లు ముందుగా దళారుల సమాచారాన్ని పోలీసులకు అందిస్తూ అడ్డుతగలకుండా ముడుపులతో జాగ్రత్త పడుతున్నారు. తనిఖీలకు పాత తేదీలతో కూడిన రసీదులను చూపిస్తూ తప్పించుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

రాత్రి సమయాల్లో అక్రమ రవాణా

పశువులను రాత్రి సమయాల్లో ఎక్కువగా అక్రమంగా రవాణా చేస్తుంటారు. పగటి సమయంలో ట్రాఫిక్ తీవ్రత ఎక్కువగా ఉండడంతోపాటు వివిధశాఖల అధికారుల తనిఖీలు కూడా జరుగుతాయన్న ఆలోచనతో అక్రమార్కులు రాత్రి సమయాల్లో రవాణా చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పశువులను తెచ్చి బెంగళూరుకు రవాణా చేస్తున్నారు. తెలంగాణ నుంచి బెంగళూరుకుకు దాదాపు 500 కిలోమీటర్ల దూరం ఉంటుంది. రాత్రి అంతా వాహనం నడిపితే ఉదయానికి బెంగళూరుకు చేరుకోవచ్చున్న ఆలోచనతో రాత్రి సమయాల్లో పశువులను రవాణా చేస్తున్నారు. పశువులను అక్రమంగా రవాణా చేసే కంటైనర్‌లకు బాడుగలు కూడా అధికంగా ఉంటాయి. డ్రైవర్లు, కూలీలకు కూడా ఎక్కువ మొత్తాల్లో చెల్లిస్తుంటారు.



మృతి చెందిన మూగజీవులను వాహనంలో తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

నిబంధనలు బేఖాతర్

పశువుల రవాణాలో వ్యాపారులు నిబంధనలను బేఖాతర్ చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఒక్కొక్క కంటైనర్‌లో 16 పశువులను, వ్యాన్లలో ఆరింటిని మాత్రమే ఎక్కించాలి. పశువు, పశువుకు మధ్య రెండుమీటర్ల దూరం ఉండాలి. రవాణా సమయంలో వాహనంలో మేత, తాగునీటి సదుపాయం కల్పించాలి. కానీ 50 నుంచి 60 పశువులను ఒక్కో కంటైనర్‌లో కుక్కేస్తున్నారు. దీంతో గమ్యం చేరేటప్పటికి కొన్ని పశువులు గాయపడుతున్నాయి. ఆవులు, వ్యవసాయానికి ఉపయోగపడే ఎద్దులు, దూడలు కబేళాలకు తరలించడం నేరం. వీటికి వ్యాపారులు తిలోదకాలు ఇస్తున్నారు. గతంలో రైతుల అవసరాల కోసం ఏర్పడ్డ సంతలు నేడు పశువులను కబేళాల తరలించడానికి ఓ వేదికగా మారాయి. పశువులను కబేళాలకు తరలించడానికి పశువైద్యశాఖ అధికారుల అనుమతితో కూడిన పత్రాలు తప్పనిసరిగా ఉండాలి. ఆయా సంతల నిర్వాహకులే కొందరు సొంతంగా అనుమతి పత్రాలను తయారు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సంతలను పర్యవేక్షించాల్సిన మార్కెటింగ్‌శాఖ అధికారులు, పశుసంవర్థక, పోలీసుశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఒక రాష్ట్రానికి చెందిన పశువులను మరో రాష్ట్రానికి తరలించరాదన్న నిబంధనను పాటించడం లేదు.

అమలుకాని చట్టాలు

పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి పలు చట్టాలు అమలులో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. 1975లో గోవధను నిషేధిస్తూ చట్టం అమలులోకి వచ్చింది. ఈ చట్టాన్ని అతిక్రమించిన వారికి ఏడేళ్ల జైలుశిక్ష విధించడంతోపాటు జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ చట్టాన్ని పోలీసులు, రవాణాశాఖ అధికారులు సమర్థవంతంగా అమలు చేయలేక పోతున్నారు. 1978లో జంతువులపై క్రూరత్వ నివారణ చట్టం అమలులోకి వచ్చింది. అక్రమ రవాణా, హింసలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొనే అవకాశం ఉంది. ఈ చట్టాన్ని ఎవరూ సక్రమంగా అమలు చేయడం లేదు.



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పరిటాల సునీత

14న పోలేపల్లికి నారా భువనేశ్వరి రాక

రామగిరి, ఫిబ్రవరి 9: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా నారా భువనేశ్వరి ఈనెల 14న పోలేపల్లికి రానున్నారని మాజీ మంత్రి పరిటాల సునీత శుక్రవారం తెలిపారు. సాయంత్రం పోలేపల్లి గ్రామానికి వెళ్లి అక్కడి నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టును జీర్ణించుకోలేక పోలేపల్లి గ్రామానికి చెందిన వెంకటరాముడు గతేడాది అక్టోబరు 13న మృతిచెందాడు. దీంతో ఆయన కుటుంబసభ్యులను పరామర్శించడానికి నారా భువనేశ్వరి రానుందని మాజీమంత్రి తెలిపారు. అనంతరం కార్యక్రమ విజయవంతంపై ఆమె పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్దిరంగయ్య, నాయకులు రామ్మూర్తినాయుడు, పరంధామయాదవ్, చంద్రప్ప, శ్రీరాములు, తిమ్మానాయుడు, శ్రీనివాసులు, మల్లికార్జున, మురళి, నందగోపాల్, పాపిరెడ్డిపల్లి రమేశ్ ఉన్నారు.

అనంత బాలోత్సవాన్ని జయప్రదం చేయండి

● ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి



బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 9: అనంత బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 12, 13, 14 తేదీల్లో నిర్వహించనున్న అనంత బాలోత్సవంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్ట్స్ కళాశాలలోని ఆయన చాంబర్‌లో అనంత పిల్లల పండుగ-4 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నిత్యం చదువులు, మార్కుల వేటలో సతమతమయ్యే విద్యార్థులు తమలో దాగున్న సృజనాత్మకత, కళానైపుణ్యత వంటివి ప్రదర్శించడానికి అనంత బాలోత్సవం చక్కటి వేదిక అవుతుందన్నారు. జిల్లాలో ఇప్పటికే మూడుసార్లు బాలోత్సవం నిర్వహించామని, ఇందులో వందలాదిమంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని గుర్తుచేశారు. మూడు రోజులు నిర్వహించే ఈ కార్యక్రమంలో అకడమిక్, కల్చరల్స్, సాంస్కృతిక, జానపద కళలు, వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, ఆటలు, పాటలు, క్విజ్, సైన్స్ ఎగ్జిబిషన్ వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాల్గొనే విద్యార్థులందరికీ ప్రశంసాపత్రాలతో పాటు విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల అధ్యాపకురాలు అరుణశ్రీ, బాలోత్సవ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి సావిత్రి, అధ్యాపకుడు లక్ష్మీకాంత్, ఉషారాణి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, నాయకురాలు గీత తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి చెస్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 9: జిల్లా స్థాయి అండర్-15 పాఠశాల క్రీడాకారులకు చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు కోచ్ హుస్సేన్ ఖాన్ తెలిపారు. బళ్లారిరోడ్డులోని వెరీడియన్ ఎకోల్ పాఠశాలలో ఈనెల 11న జిల్లా స్థాయి అండర్ 7, 9, 11, 13, 15 బాలబాలికల కేటగిరిలలో చెస్ పోటీలు జరుగుతాయన్నారు. పాఠశాలల్లో చదువుతున్న చెస్ క్రీడాకారులను ప్రోత్సహించడానికే ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్, ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ సహకారంతో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్ నంబరు 8008161811ను సంప్రదించాలని కోరారు.

తప్పుల తడకగా ఓటర్ల జాబితా


● నివాసం ఒకచోట.. పోలింగ్ కేంద్రం మరోచోట.. ● ధర్మవరంలో ఒకే డోర్ నంబర్‌తో నాలుగు ఓట్లు ● డబుల్ ఎంట్రీలు యథాతథం

కదిరి, ఫిబ్రవరి 9: తుది ఓటరు జాబితాలో తప్పులు కుప్పలుగా కనిపిస్తున్నాయి. బీఎల్‌వోలు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లకుండా ఇష్టారాజ్యంగా ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేశారనేందుకు అనేక ఉదాహరణలు కనిపిస్తున్నా యి. ఒక వ్యక్తికి రెండు నియోజక వర్గాల్లో ఓటు ఉంటే, మరోచోట ఒకే పోలింగ్ బూత్‌లోనే రెండు ఓట్లు ఉన్నాయి. చనిపోయినవారికి ఓటు హక్కు కల్పించారు బీఎల్‌వోలు. కదిరి పట్టణంలో నివాసం ఉండేవారికి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉండే పోలింగ్ కేంద్రాన్ని కేటాయించారు. పార్టీల నాయకులు ఫిర్యాదులు చేసినా వాటిని పట్టించుకోకుండా యథాతథంగా తుది జాబితా ప్రకటించారు.

● కదిరి నియోజకవర్గంలో 241 పోలింగ్ కేంద్రంలో జీ సుస్మితకు రెండు ఓట్లు ఉన్నాయి. సీరియల్ నెంబర్ 141, 143 ఇదే కేంద్రంలో కడపల హరినాథ్ రెడ్డికి సీరియల్ నంబర్ 227, 237 రెండు ఓట్లు ఉన్నాయి. ఆర్‌ఆర్‌వీ 2374999, 1967637. 172 కేంద్రంలో జీ. మమతకు సీరియల్ నెంబర్ 78, 794లో రెండు ఓట్లు ఉన్నాయి. పోలింగ్ కేంద్రం నెంబర్ 180లో సీరియల్ నంబర్ 576, 1073లలో తిమ్మబోయిన ప్రతాప్‌కు రెండు ఓట్లు ఉన్నాయి. 1007, 766 నెంబ ర్లతో కుప్పల సుకన్యకు రెండు ఓట్లు కల్పించారు. 936, 948 నెంబర్లతో సిద్ధవటం వేణుగోపాల్‌రెడ్డికి రెండు ఓట్లు ఉన్నాయి. పోలింగ్ స్టేషన్ నెంబర్ 172లో సీరియల్ నెంబర్ 547లో అంజన్‌రెడ్డి అనే వ్యక్తి ఫోటోకు బదులు మరోకరి ఫొటో పెట్టారు. బూత్ నెంబర్ 172లో సీరియల్ నెంబర్ 262 గల ఎస్. రూపకు కొన్ని సంవత్సరాల కిందట వివాహం అయింది. అయినా ఓటు తొలగించలేదు. ఇదే కేంద్రంలో సీరియల్ నెంబర్ 376లో ఆచారి కృష్ణమ్మ చనిపోయినా ఓటు తొలగించలేదు. ఎంఎక్స్‌కే 1579648. బూత్ నంబర్ 180లో సీరియల్ నంబర్ 510లో ఉన్న శ్రీనివాసులు, 536 వల్లెపు లక్ష్మీదేవి, 852లో ఉన్న రామక్రిష్టారెడ్డిలు చనిపోయిన ఓట్లు తొలగించలేదు.



ఒకే కేంద్రంలో రెండు ఓట్లు కలిగిన ఓటర్లు




పోలింగ్ కేంద్రానికి మార్చిన ఫొటో



రాయదుర్గంలో ఒకే పేజీలో రెండుచోట్ల నమోదైన ఓట్లు

ఒకే డోర్ నంబర్‌లో నాలుగు ఓట్లు

ధర్మవరంరూరల్ : మండలంలోని నిమ్మలకుంట గ్రామంలో ఓటరు జాబితాలో మళ్లీ అవే తప్పులు వచ్చాయి. గ్రామంలోని పోలింగ్ కేంద్రం నెంబర్ 281లో సీరియల్ నెంబర్లు 68, 69, 488, 500 లో హేమంత్‌జ్యోతి, జ్యోతి హేమంత్ పేరు మీద డోర్ నెంబర్ 5-25-1లో నాలుగు ఓట్లు వచ్చాయి. ఇంటింటి సర్వే చేసినా మళ్లీ డబుల్ ఓట్లు రావడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పోలింగ్ కేంద్రాలే మార్చేశారు..

పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉండే ఓటర్ల పోలింగ్ కేంద్రాలనే మార్చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్లలోని కుటాగుళ్ల ప్రధాన రహదారి, దర్గావీధి, పులివెందుల రోడ్డు, ఎస్‌సీ కాలనీ, ఎస్‌టీ కాలనీ, తారకరామనగర్, వాల్మీకి రోడ్డులలో ఉండే ఓటర్లకు కుటాగుళ్లలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఉండేది. ప్రస్తుతం అక్కడి వారికి దాదాపు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉండే సెరికల్చర్ మార్కెట్ యార్డులోని పోలింగ్ కేంద్రానికి మార్చారు. పట్టణంలోని మెయిన్ రోడ్డు, హిందుపురం రోడ్డు, సింహకోట, గుడి పడమర వీధి, బ్రహ్మణ వీధిలోని ఓటర్లుకు అమృతవల్లి డిగ్రీ కళాశాలలో పోలింగ్ కేంద్రం ఉండేది. ఇప్పుడు క్లాక్‌టవర్ వద్ద ఉన్న రాణీపేట పాఠశాలకు మార్చారు. గొల్లమ్మ మండపం వద్ద ఉన్న ఓ పోలింగ్ కేంద్రాన్ని చావిడి పోలింగ్ కేంద్రానికి మార్చారు.

డబుల్ ఎంట్రీలను తొలగించని అధికారులు



నమోదైన డబుల్ ఎంట్రీలు

ఆత్మకూరు: మండలంలో ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీల తొలగింపు పై అధికారులు స్పందించక పోవడంతో గ్రామాల్లో రాజకీయ చిచ్చు రేగుతుంది. మండలంలోని 17 గ్రామ పంచాయల్లో 800కు పైగా తొలగింపునకు దరఖాస్తులు అందజేశారు. అయితే బి యాలేరువై కొత్తపల్లి,తోపుదుర్తి గ్రామాల్లో సందిగ్ధత నెలకొంది. బి యాలేరు గ్రామంలో లేనివారివి కూడా ఓటర్లు ఉన్నట్లు ఫిర్యాదులు చేస్తే బిఎల్ ఓ మాత్రం పట్టించుకోకపోడం ఏమిటని గ్రామస్థులు మండి పడుతున్నారు. ఎన్‌డీఎఫ్0820572 వెంకటరమణారెడ్డి మాగంటి తండ్రి కేసన్న మంగ పాటి, ఎన్‌డిఎఫ్0820580వ వసుందర మంగపాటి, భర్త రమణారెడ్డి మంగపాటి పేరుమీద అనంతపురం మూరుతినగర్ బూత్ 113లో ఉన్నాయి. బి యాలేరు గ్రామంలో కూడా వైడబ్లు3052826 నంబరుతో రమణారెడ్డి,వైడబ్లుబి2974954తో వసుందర పేర్లుబూత్ నంబరు 29లో నమోదయ్యాయి. దీంతో పాటు ఎన్‌డీఎఫ్ 1043470 పుల్లారెడ్డి తండ్రి ఎర్రెప్ప పేరు యాలేరులో బూత్ నంబరు 29లోఉంది ఇదే ఓటు అనంతపురంలోని బూత్ నంబరు 101లో డిజిఎన్ 1193259 నంబరులో పుల్లారెడ్డి పేరు నమోదు అయింది. ఫిర్యాదు చేసిన వారిపై గొడవలకు దిగి బెదిరిస్తున్న ప్రచారం జరుగుతుంది.

ప్రతి పేజీలోనూ తప్పులే..



8 చోట్ల జీరో డోర్ నంబర్లు

రాయదుర్గం: ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓటర్ల జాబితాలో ప్రతి పేజీలో తప్పులు కనిపిస్తున్నాయి. రాయదుర్గం నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటర్ల జాబితాలను పరిశీలిస్తే తప్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీంతో ఎన్నికల అధికారులు చేసిన కసరత్తు ఎంతమేరకు సరిగ్గా చేశారో దీన్ని బట్టి అర్థమవుతోంది. ముఖ్యంగా 212 బూత్‌నంబర్‌లో ఉన్న ఓటర్ల జాబితాలో ఒకే పేజీలో ఎనిమిది మంది ఓటర్లకు డోర్‌నంబర్లు లేవు. జీరో డోర్ నంబర్‌తో అడ్రస్సులు లేకుండా అలాగే ముద్రించడం విమర్శలకు తావిస్తోంది. అదే విధంగా 212 బూత్‌నంబర్‌లో ఉన్న సీ కరుణాకర్ అనే యువకుడి ఓటు 850 సీరియల్ నంబర్‌లో ఉండగా 221 బూత్‌నంబర్‌లో 329 సీరియల్ నంబర్‌లో చందా కరుణాకర్ పేరుతో రెండవచోట ఓటు నమోదైంది. డబుల్ ఎంట్రీలు ఉండడంతో పాటు జీరో డోర్‌నంబర్‌లు ఉండడం చూస్తే పారదర్శకత ఏమాత్రం కనిపించడం లేదు. అలాగే డీ నందిని అనే ఓటరుకు సంబంధించి 1431 సీరియల్ నంబర్‌లో ఉండగా అదే పేజీలో 1434 సీరియల్ నంబర్‌లో డీ నందిని పేరుతో రెండవ ఓటు పైన, కింద ఒకే ఫొటోతో ముద్రించారు. దీంతో ఓటర్ల జాబితాలోని తప్పులు ఎక్కడికక్కడ అగుపిస్తుండడంతో రాజకీయపార్టీలు తలపట్టుకుంటున్నాయి.

12వ పీఆర్సీ కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమం: ఏపీటీఎఫ్

అనంతపురం విద్య, ఫిబ్రవరి 9: ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు 12వ పీఆర్సీ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపట్టనున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం ఆ సంఘం నాయకులు ఉపాధ్యాయభవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్లకు జూలై 2023 నుంచి వర్తించే విధంగా 12వ పీఆర్సీ అమలు చేయాలని ఉద్యమించ నున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 12వ వేతన సవరణ సంఘం కమిషన్‌ను ఏర్పాటుచేసి ఆ రు నెలలైనా కమిషన్ ఇంత వరకూ ఎలాంటి బాధ్యతలు తీసుకోలేదన్నారు. ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో సీఎం జగన్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో చర్చించి 30 శాతం ఫిట్ మెంట్ పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2018 నుం చి రావాల్సిన కరువు భత్యం, ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. 11వ పీఆర్సీ బకాయిలును సైతం వెంటనే ఇవ్వాలన్నారు. ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 6100 పోస్టులతో కాకుండా 20 వేల పోస్టులతో డీఎస్సీ ప్రక టించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్, జిల్లా ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్, ఇతర నాయకులు ప్రభాకర్, బొమ్మయ్య, భాస్కర్, సతీష్, చెన్నకేశవులు, హనుమప్ప, వెంకటరమణ, కృష్ణ, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరసింహులు

టీడీపీతోనే పేదల జీవితాల్లో వెలుగులు



ధర్మవరం 36వ వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న టీడీపీ నాయకులు



బత్తలపల్లి మండలం తంబాపురంలో ..



తాడిమర్రి మండలం నార్శింపల్లిలో ..

● భవిష్యత్తుకు గ్యారెంటీలో పార్టీ నాయకులు

ధర్మవరం, ఫిబ్రవరి 9: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే పేదల జీవితాల్లో వెలుగులు ఉంటాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని 36వ వార్డులో శుక్రవారం వారు నాయకులు, కార్యకర్తలతో కలిసి బాబుష్యూరిటీ -భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ మినీమేనిఫెస్టో పథకాల గురించి వివరించారు. అనంతరం మాట్లాడుతూ.. చంద్రబాబు సీఎం అయితే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయన్నారు. వైసీపీ పాలనంతా దౌర్జన్యాలు, అరాచకాలు, కబ్జాలు, అక్రమ కేసులతో సాగిందన్నారు. అభివృద్ధి మచ్చుకైనా కనిపించలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రం మళ్లీ అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, మాదనమహేశ్వరి, మాదన సుబ్బయ్య, శీలామూర్తి, జిలకరశీన, అత్తార్ రహీంబాషా, రాళ్లపల్లిషరీఫ్, మారుతీస్వామి, చట్టా లక్ష్మీనారాయణ, కరెంటు ఆది, మాధవరెడ్డి, గోసల శ్రీరాములు, బడిగింజల రమణ, తోట నారాయణస్వామి, యుగంధర్, చెలిమిశివరాం తదితరులు పాల్గొన్నారు.

తంబాపురంలో భవిష్యత్తుకు గ్యారెంటీ

బత్తలపల్లి: మండలంలోని తంబాపురం పంచాయతీలో టీడీపీ శ్రేణులు బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు మినీమేనిఫెస్టో కరపత్రాలు పంచుతూ అందులోని పథకాల గురించి వివరించారు. ఇంటిలో ఎవరెవరికి ఏయే పథకాలు వర్తిస్తాయి. వాటివల్ల ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో తెలియజేశారు. చంద్రబాబు సీఎం అయితే అందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చల్లా శ్రీనివాసులు, నాయకులు నారాయణరెడ్డి, జక్కంపూటి నాగభూషణ, గంటాపురం జగ్గు, తూశ్లారి సతీష్, ఉమాపతినాయుడు, సాంబ, సురేంద్రనాయుడు, చితంబర్‌రెడ్డి, కిష్టయ్య, లక్ష్మినారాయణ, సూరి తదితరులు పాల్గొన్నారు.

నార్శింపల్లిలో..

తాడిమర్రి: మండలంలోని నార్శింపల్లిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు మినీమేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి పథకాల గురించి తెలియజేశారు. చంద్రబాబు సీఎం అయితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. వైసీపీ పాలనలో ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదన్నారు. కనుక చంద్రబాబును తిరిగి సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కూచిరామ్మోహన్, నాయకులు రఘురాంచౌదరి, ఆదినారాయణ, జనార్దన్ పతకమూరి, సాయి, ఆలం సూరి, గొంది హరినాథ్, క్రిష్ణమనాయుడు, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ కుటుంబ సభ్యులకు చిలకం పరామర్శ



గణేశ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చిలకం మధు

ధర్మవరం, ఫిబ్రవరి 9: అన్నమయ్య జిల్లాలో ఇటీవల ఎర్రచందనం స్మగ్లర్ల చేతిలో మృతి చెందిన కానిస్టేబుల్ బిల్లే గణేశ్ కుటుంబసభ్యులను జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. పట్టణంలోని గుట్టకిందపల్లిలో గల గణేశ్ ఇంటికి శుక్రవారం ఆయన వెళ్లారు. అక్కడ తొలుత గణేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి భార్య అనూష, తల్లి అలివేలమ్మను పరామర్శించి రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా సాయినగర్‌కు చెందిన జనసేన క్రియాశీలకసభ్యుడు రమేష్ గత గురువారం కనగానపల్లి మండలం తగరకుంటకు బంధువుల ఇంటికివెళ్లి అక్కడి కెనాల్‌లో ప్రమాదవశాత్తూ కొట్టుకుపోతున్న బాలుడిని కాపాడే ప్రయత్నంలో మృతిచెందాడు. దీంతో ధర్మవరం ప్రభుత్వాస్పత్రిలో ఉన్న రమేశ్ మృతదేహాన్ని చిలకం మధు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అంత్యక్రియల కోసం రూ.10వేలు అందజేశారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్ వెంకటరెడ్డి, గుట్టకిందపల్లికి చెందిన వెంకటప్ప, జనసేన మత్స్యకారవిభాగపు రాష్ట్ర ప్రధానకార్యదర్శి బెస్తశ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డివి బూటకపు హామీలు: టీడీపీ

కొత్తచెరువు, ఫిబ్రవరి 9: బుక్కపట్నం చెరువును నింపలేని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నియోజకవర్గంలోని 193 చెరువులను నీటితో నింపుతానని బూటకపు హామీలు ఇస్తూ పాదయాత్ర చేయడం రైతులను మోసగించడమేనని టీడీపీ నాయకులు విమర్శించారు. మండల కేంద్రంలోని గాంధీనగర్ పాఠశాల ఆవరణలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి గా ఉన్న పల్లె రఘునాథరెడ్డి మూడు దఫాలు బుక్కపట్నం చెరువును నింపి రైతులకు సాగు, తాగు నీటిని అందించారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి గెలిచిన వెంటనే నియోజకవర్గంలోని 193 చెరువులకు నీటిని అందిస్తానని హామీ ఇచ్చారని, అయితే ఐదేళ్లు గడుస్తున్నా.. ఇంతవరకు ఒక్క చెరువుకు కూడా నీటిని నింపలేదని తెలిపారు. ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడుతుండడంతో.. మళ్లీ చెరువులకు నీటిని నింపుతానంటూ పాద యాత్ర పేరిట డ్రామాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారం లోకి రావడంఖాయమని, 193 చెరువులకు నీటిని అందించేది టీడీపీనేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామక్రిష్ణ, నాయకులు బండ్లపలిరాజు, బీడుపల్లి సుబ్బరాయుడు, గాజులచంద్ర, షర్ఫుద్దీన్, టైలర్‌కొండ, పెద్దన్న పాల్గొన్నారు.

రవూఫ్‌కు ఘన నివాళి

కదిరి, ఫిబ్రవరి 9: విప్లవ నేత ఎస్‌ఏ రవూఫ్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కుటాగుళ్లలోని ఆయన సమాధి వద్ద స్థానికులు, బీఎస్పీ నాయకులు ఘన నివాళులర్పించారు. అనంతరం ప లువురు మాట్లాడుతూ రవూఫ్ మరణించేంతవరకు పీడిత ప్రజలకోసం పనిచేశారని కొనియాడారు. సాయుధ పోరాటమే మార్గమని నమ్మి అదే సిద్ధాంతంపైన జీవింతాతం పనిచేశారన్నారు. నిజాయితీ, నిబద్ధతకు ఆయన మారుపేరన్నారు. న్యాయవాదిగా జీవితాన్ని ప్రాంభించిన ఆయన కామ్రేడ్ చార్‌మంజుందర్ ఆశయాలకు ఆకర్షితులై విప్లవం బాట పట్టారన్నారు. కుటాగుళ్లలో జన్మించిన రవూఫ్ దేశానికే విప్లవ మార్గాన్ని చూపారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో రామన్న, ప్రసాద్, కుటాగుళ్ల వెంకటేష్, బాషా, అలీఖాన్, షకూర్‌బాషా, తస్లిమాభాను, మిలటరీ గంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు

నల్లచెరువు, ఫిబ్రవరి 9: మండలంలో మొటుకుపల్లి ఆర్డీటీ కార్యాలయంలో శుక్రవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. నల్లచెరువు, తనకల్లు, గోరంట్ల, అమడగూరు, ఓడీసీ, నల్లమాడ, తలుపుల, గాండ్లపెంట, ఎన్పీకుంట ప్రభుత్వ పాఠశాలల్లో 5వతరగతి చదువుతున్న40 మంది విద్యార్థులకు రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో తెలుగు, గణితం, జనరల్ నాలెడ్జిలో క్విజ్ పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి నల్లచెరువు ఏరియా టీమ్, రెండవ బహుమతి నల్లమాడ ఏరియా టీమ్‌లు గెలుపొందారు. ఎడ్యుకేషన్ డైరెక్టర్‌మోహన్‌మురళి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై గర్భిణులకు అవగాహన

బత్తలపల్లి, ఫిబ్రవరి 9: క్రమం తప్పకుండా మందులు వాడితే హెచ్‌ఐవీ ఉన్నగర్భిణులకు పుట్టే పిల్లలకు వ్యాధి సోకదని ఏ ఆర్టీ సెంటర్ వైద్యాధికారి మనోరంజన్ తెలిపారు. మండలకేంద్రంలోని ఏఆర్టీసెంటర్‌లో శుక్రవారం హెచ్‌ఐవీ ఉన్న గర్భిణులకు సాతిఅనే సంస్థ ఆధర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోరంజన్ మాట్లాడుతూ..గర్భం దాల్చిన ప్రతి మహిళ అన్ని రకాల రక్తపరీక్షలతో పాటు హెచ్‌ఐవీ పరీక్ష చేయించుకోవాలన్నారు. హెచ్‌ఐవీ ఉందని తెలితే దగ్గరలోని ఏఆర్టీ సెంటర్‌కు వెళ్లిమందులు వాడాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రామాంజనేయులు, రాధ ,శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

దస్తుల పంపిణీ

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 9: టీడీపీ సీనియర్ నాయకుడు, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు జరిపిటి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వడ్డెర సంఘం నాయకులు సిమెంట్ పోలన్న, దళవాయి వెంకటనారాయణ జిల్లాకేంద్రపరిధిలోని కర్ణాటకనాగేపల్లి, బీసీకాలనీల్లో ప్రజలకు శుక్రవారం దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వడ్డెర సంక్షేమసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దండగల మారెప్ప, నాయకులు గంగులప్ప, ఉత్తన్న, శ్రీరాములు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నరసింహులు, (ఫైల్)

ముదిగుబ్బ, ఫిబ్రవరి9: మండలంలోని రాళ్లఅనంతపురం క్రాస్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నంబులపూలకుంట మండలం మండెంవారిపల్లి గ్రామానికి చెందిన గోవిందు కుమారుడు నరసింహులు(24) డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అయితే అతను శుక్రవారం 407 వాహనానికి కదిరిలో ఎఫ్‌సీ చేయించుకుని అక్కడి నుంచి మధ్యాహ్న సమయంలో ధర్మవరం వైపునకు బయలుదేరాడు. కాగా మార్గంమధ్యలోని రాళ్లఅనంతపురం సమీపంలోకి రాగానే వాహనం ప్రమాదవశాత్తూ డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి వివాహం కాలేదు.

రైలు ఢీకొని వ్యక్తి..

కదిరి, ఫిబ్రవరి 9: మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్ల వద్ద శుక్రవారం రైలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఘటనపై రైల్వే ఎస్‌ఐ రహీమ్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కుటాగుళ్లకు చెందిన వెంకటేష్ (53) తన భార్యతో కలిసి ఇంటికి సమీపంలో ఉన్న రైలు పట్టాలు దాటుతున్నాడు. భార్య ముందుగానే పట్టాలు దాటింది. మూగ, చెవిటి అయిన వెంకటేష్ నిదానంగా దాటుతూ రైలు రావడాన్ని గమనించలేదు. రైలు వస్తున్నట్లు భార్య సైగలు చేస్తున్నప్పటికీ ఆయన అర్థం చేసుకోలేదు. అంతలోనే తిరుపతి నుంచి నుంచి అకోలా వెళ్తున్న రైలు ఢీకొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి9: మండలంలోని గొట్లూరు పెట్రోల్ బంకు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాల్లోకెళ్తే.. మల్కాపురం గ్రామానికి చెందిన వెంకటేష్ శుక్రవారం తన ద్విచక్రవాహనంలో ధర్మవరం బయలుదేరాడు. కాగా గొట్లూరు పెట్రోల్‌బంకు వద్దకు రాగానే వెనుకవైపు నుంచి కారు వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకటేష్ కిందపడి గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పుట్టపర్తి, ఫిబ్రవరి 9: మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ నారాయణమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చెప్పారు. కనుక గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని ఆమె కోరారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

కదిరి, ఫిబ్రవరి 9: టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వల్లెపు సోమశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. తెలుగుతల్లి ముద్దుబిడ్డ పీవీ నరసింహా రావుకు భారతరత్న ఇవ్వడం గర్వించదగ్గ విషయమన్నారు. అలాగే తెలుగుజాతి ఉన్నతికి ఎంతో కృషి చేసిన ఎన్టీ రామారావుకు భారత రత్న ఇవ్వాలని ఆయన కోరారు.

మెగా డీఎస్సీని విడుదల చేయాలి

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 9: ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలంటూ ఏఐవైఎఫ్ నియకులు డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుళ్లాయప్ప విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 25వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే.. ప్రభుత్వం కేవలం 6,100 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తున్నట్లు ప్రకటించిందన్నారు. ఇది నిరుద్యోగులను మోసం చేసినట్లేనన్నారు. వెంటనే ఖాళీగా ఉన్న పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భరత్, క్రాంతి, రెడ్డెయ్య, బలరాం, కార్తిక్ తదితరులు ఉన్నారు.

నిరాహార దీక్ష భగ్నం

కదిరిఅర్బన్, ఫిబ్రవరి9: పట్టణంలోని హిందూపురం రోడ్డులో గల సర్వే నంబరు 23లో ప్రభుత్వ భూమి ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులు చేపట్టిన నిరా హార దీక్షను శుక్రవారం పోలీసులు భగ్నం చేశారు. పట్టణ సీఐ పుల్లయ్య దీక్షా శిబిరం వద్దకు చేరుకుని ఆందోళన కారులతో చర్చించి దీక్ష విరమింపజేయాలని కోరారు. వారు ససేమిరా అనడంతో దీక్ష చేస్తున్న నాగన్న, టీఎండీ ఇలియాజ్, గంగులమ్మ, సుగుణమ్మతో పాటు పలువురిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేశారు. దీక్ష భగ్నం చేసినంత మాత్రాన ఉద్యమం ఆపమని, భూకబ్జాదారులపై చర్యలు తీసుకునేవరకు పోరాటం చేస్తామని ఆర్సీపీ నాయకులు పేర్కొన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పని చేద్దాం



ఓడీసీ సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్



బుక్కపట్నం సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

● పార్టీ సమావేశంలో నాయకుల పిలుపు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 9: వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా.. అందరం కలిసి కట్టుగా పని చేద్దామని, చంద్రబాబును ముఖ్యమంత్రిగా, నియోజకవర్గంలో పల్లె రఘునాథ రెడ్డి ని ఎమ్మెల్యేగా చేసుకుందామని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని వెంకటసాయి ఐటీఐలో శుక్రవారం టీడీపీ మండల సర్వసభ్య సమావేశం మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబును సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధి కోసం పల్లెను గెలిపించుకోవాలన్నారు. అందరం కలిసికట్టుగా పని చేసి వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. మినీమేనిఫెస్టో పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, అలాగే వైసీపీ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు పిట్టా ప్రభాకర్ రెడ్డి, టీసీ సెల్ రాష్ట్ర నాయకుడు జెరిపిటి అంజినప్ప, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బడిశం రామాంజనేయులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జాకీర్‌హుస్సేన్, తెలుగుయువత నాయకుడు బూదిలి ఓబులరెడ్డి, టీఎస్‌టీయూసీ నాయకుడు నిజాం, మండల ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, మాజీ కన్వీనర్లు రాజారెడ్డి, రామానాయుడు, ఐటీడీపీ షావాజ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక..

మండలంలోని తుమ్మకుంటపల్లికి చెందిన వైసీపీ నాయకుడు అంజనప్పనాయుడు, అతని అనుచరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి మండల కన్వీనర్ జయచంద్ర కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొడదాం..

బుక్కపట్నం: అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని తరమికొడదామని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో టీడీపీ నాయకులు పార్టీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అవలంభిస్తున్న ఆరాచక పాలనుకు చరమగీతం పాడదామన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు రావాలన్నారు. అలాగే ఎమ్మెల్యేగా పల్లె రఘునాథరెడ్డి ఎన్నికైతేనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. నేటినుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. సమావేశంలో మండల కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, నాయకులు పెద్దరాసు సుబ్రమణ్యం, సామకోటి ఆదినారాయణ, గోపాలపురం గంగాధర్, లావణ్యగౌడ్, సాకే యశోద, లింగప్పగారిపల్లి రవి, సయ్యద్‌బాషా, కరణం శ్రీరాములు, అబ్దుల్ వాజీద్, సూరి, తెలుగుయువత నాయకులు సుధీర్, మంజు, సతీష్‌రాయల్, చంద్ర కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



ఎనుమలపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి



గాండ్లపెంట కేజీబీవీలో విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రను వేస్తున్న దృశ్యం

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 9: మున్సిపాలిటీ పరిధిలోని ఎనుమలపల్లి జడ్పీ హైస్కూల్లో శుక్రవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రతిసంవత్సరం ఫిబ్రవరి , ఆగష్టు నెలల్లో 1 నుంచి 9 ఏళ్ల వయసున్న చిన్నారులకు ఈ మాత్రలను వేయడం జరుగుతుందన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలతో పాటు అంగన్వాడీ కేంద్రాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా ఇప్పుడు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు వేయడం వల్ల నులిపురుగుల నశిస్తాయని, తద్వారా రక్తహీనత లేకుండా పోతుందని, అలాగే పోషకాహార లోపం కూడా ఉండదని తెలిపారు. నులిపురుగులు ఉంటే పిల్లల్లో కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటివి ఉంటాయన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం వలన ప్రేగుల్లోని నులిపురుగులు నశించిపోతాయన్నారు. జిల్లావ్యాప్తంగా 5050 పాఠశాలల్లో 374171 మంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు అందించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎనుమలపల్లి పాఠశాలలో 461 మంది విద్యార్థులకు గాను 371 మందికి అల్బెండజోల్ మాత్రలు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో స్కూల్‌హెల్త్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నివేదిత, డెమో బాబాఫక్రుద్దీన్, డీపీఎం కేసీకే నాయక్, కోఆర్డినేటర్ రాజేష్, వైద్యాధికారి జ్యోత్స్న, సీహెచ్‌ఓ నగేష్ , వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తనకల్లు: మండలంలోని గ్రామాల్లోగల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. మండలవ్యాప్తంగా 8,089మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందించాల్సి ఉండగా, 7,753మందికి పంపిణీ చేసినట్లు వైద్యుడు లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. గేమేనాయక్‌తండా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఈ మాత్రలను లోకేశ్వర్‌రెడ్డితో పాటు డాక్టర్ ధర్మరాజు దగ్గరుండి వేశారు. ఈఓఆర్డీ ఆనందయ్య మాత్రల పంపిణీని పర్యవేక్షించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

గాండ్లపెంట: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేసినట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జగన్మోహన్, కేజీబీవీ ఎస్‌ఓ దుర్గా, వైద్య సిబ్బంది, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఓబుళదేవరచెరువు: మండలంలోని గౌనిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు నులిపురుగుల నివారణ మందులు వేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు నులిపురుగులవలన కలిగే నష్టాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త షమీమ్ ఆరోగ్య కార్యకర్త అశ్విని, ఆశకార్యకర్త లక్ష్మీ ఉన్నారు.

బీసీల ద్రోహి సీఎం జగన్

● వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలి

● జయహో బీసీ సదస్సులో వక్తల పిలుపు

నల్లచెరువు, ఫిబ్రవరి 9: బీసీల ద్రోహి సీఎం జగన్ అని, రాష్ట్రంలో బీసీలను మోసం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని, రానున్న ఎన్నికల్లో బీసీలంతా ఓటుతో బుద్ధి చెప్పాలని వక్తలు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని గీతామందిరంలో శుక్రవారం టీడీపీ మండల కన్వీనర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో జయహో బీసీ సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు పర్వీన్‌భాను, వాల్మీకి విద్యాసంస్థల అధినేత పవన్‌కుమార్‌రెడ్డి తోపాటు పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు. మొదట నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ప్రతి బహిరంగ సభల్లోనూ నా బీసీ, నా ఎస్సీ, నా ఎస్టీ అని చెప్పుకునే జగన్.. వారికి మాత్రం చేసిందేమీ లేదని మండిపడ్డారు. బీసీలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశారే తప్పా.. వాటికి రూపాయి కూడా నిధులను మంజూరు చేయలేదని దుయ్యబట్టారు. వైసీపీ పాలనలో బీసీలకు ఒరిగిందేమీ లేదని అన్నారు. టీడీపీ పాలనలోనే బీసీలు అభ్యున్నతి సాధించారన్నారు. జగన్ వ్యాపార వేత్త అని సొంత లాభం చేసుకుంటారని అన్నారు. చంద్రబాబు ఆర్థిక వేత్త అని సమాజాన్ని బాగు పరుస్తారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీసీలందరూ జగన్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని అన్నారు. చంద్రబాబును సీఎంగా చేసుకుందామని, నియోజకవర్గంలో కుందికుంటను ఎమ్మెల్యేగా గెలిపించుకుందాని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాబూ సాబ్, నాయకులు మనోహర్, బంగారు కృష్ణమూర్తి, నాగభూషణం నాయుడు, అశ్వర్థనాయుడు, దాద్దెం శివారెడ్డి, అంజనప్ప, కిరణ్, రమేష్, సతీష్, నాగిరెడ్డి, సోంపాళ్యం నాగభూషణం కార్యకర్తలు పాల్గొన్నారు.



జయహో బీసీ సదస్సులో ఐక్యత చాటుతున్న బీసీ నాయకులు



సభకు హాజరైన బీసీలు, టీడీపీ శ్రేణులు

కొండ ప్రాంతాలకు నిప్పు

● అగ్నికి ఆహుతవుతున్న చెట్లు, వన్యప్రాణులు

● సమీపంలోని పండ్లతోటలకూ వ్యాపిస్తున్న మంటలు

● పట్టించుకోని అటవీ అధికారులు



అగ్నికి ఆహుతి అవుతున్న బోగాదమ్మ కొండ

గాండ్లపెంట, ఫిబ్రవరి 9: మండలంలోని పలు గ్రా మాల్లో కొండలు అగ్నికి ఆహుతి అవుతుండడం వల్ల అం దులోని చెట్లు, వన్యప్రాణులు తదితరాలు కాలి బూడిదవుతున్నాయి. ముఖ్యంగా దేవరకొండ, బోగాదమ్మకొండతో పాటు కటారుపల్లి, చామాలగొంది తదితర గ్రామాల్లో కొండలు గత మూడురోజులుగా అగ్నికి ఆహుతి అవుతూనే ఉన్నాయి. విషయం తెలిసినా అటవీశాఖాధికారులు పట్టించుకోవడం లేదు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు బీడీలో, సిగరెట్లో కాల్చి నిప్పు ఆర్పకుండా పడేస్తుండడం వల్ల మంటలు సోకుతున్నాయని, ప్రస్తుతం ఎండలు అధికమవుతుండడంతో గడ్డి, చిన్న చిన్న చెట్లు ఎండుతుండడం వల్ల సునాయాసంగా మంటలు వ్యాపిస్తున్నాయని గ్రామాల ప్రజలు చెబుతున్నారు. మంటలు వ్యాపిస్తుండడంతో కొండల శివారు ప్రాంతాల్లోని తోటల్లో గల పండ్ల చెట్లు, డ్రిప్పులు, స్ప్రింక్లర్ల పైపులు సైతం కాలిబూడదవుతున్నాయని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. అడవి కాలిపోవడం వల్ల అందులో ఉన్న వన్యప్రాణులు, చెట్లు బూడిదవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. ప్రకృతి సంపద అగ్నికి ఆహుతి అవుతుంటే.. సంబంధితాధికారులు నిర్లక్ష్యంగా ఉండడం ఏమిటని మండిపడుతున్నారు. అధికారులు ముందస్తుగా కొండ ప్రాంతాల్లో అగ్నిమాపక చర్యలు తీసుకుని ఉంటే, కొండలు పూర్తిస్థాయిలో కాలిపోయేవి కాదంటున్నారు. ఇప్పటికైనా ముందస్తు చర్యలు తీసుకుని, ప్రకృతి సంపదను కాపాడాలని వారు కోరుతున్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు ఆహ్వానం



ఆహ్వాన పత్రికను బాలయ్యకు అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

హిందూపురం, ఫిబ్రవరి 9: పట్టణంలోని దండురోడ్డులో 14వ తేదీన 27 అడుగుల ఏకశిల ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠకు రావాలని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను కమిటీ సభ్యులు కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో బాలకృష్ణను కలిసిన ఆలయ కమిటీ చైర్మన్ నారాయణస్వామి, నంజప్ప, ప్రభాకర్, ప్రియా గంగాధర్ ఆహ్వాన పత్రికలు అందజేశారు. 27అడుగుల ఎత్తు ఏకశిల ఆంజనేయ విగ్రహం ఈ ప్రాంతంలో ఎక్కడా లేదని హిందూపురంలో ఏర్పాటు చేయడం అభినందించగ్గ విషయమని ఎమ్మెల్యే అన్నారు. వెంకటేశులు, సూరి, చంద్ర, గంగప్ప, నాగరాజు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్లకు అభినందన



టీడీపీ నాయకులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం, ఫిబ్రవరి 9: టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం 90శాతం పూర్తిచేసిన బూత్ ఇన్‌చార్జ్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లను ఎమ్మెల్యే బాలకృష్ణ సత్కరించారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో మూడో క్లస్టర్ ఇన్‌చార్జ్ చంద్రమోహన్, బూత్ ఇన్‌చార్జ్ రవీంద్రనాయుడు, సురేష్, రవి, రవిచంద్ర, ప్రసాద్, కిరణ్ బాలయ్య చేతులమీదుగా స్మార్ట్ వాచ్‌లు అందుకున్నారు.

నేడు చోళమాంబదేవి జాతర

మడకశిరటౌన్, ఫిబ్రవరి 9: అమరాపురంలో వెలిసిన చోళమాంబదేవి జాతర మహోత్సవాలు శనివారం నుంచి వారం రోజులపాటు వైభవంగా నిర్వహించనున్నారు. 102 సంవత్సరాల అనంతరం అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తుండటంతో పెద్ద జాతర కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. 1922 సంవత్సరంలో చోళమాంబదేవి జాతర జరిగినట్లు పూర్వీకులు చెబుతున్నారు. 102 ఏళ్ల అనంతరం జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. 10న గణేషపూజ, అభయ ఆంజనేయస్వామి వారికి తమలపాకు పూజ, 11న ఆలయంలో కలశ ప్రతిష్ఠాపన, విశేష పూజలు, భారీ ఊరేగింపు, జలధి నిర్వహించనున్నారు. 12న ఉదయం గంగపూజ, స్వస్తి పుణ్యాహ వాచనం, అమ్మవారి ఊరేగింపు, 13న జ్యోతుల ఉత్సవం, 14న ప్రత్యేక పూజలు, పట్టణంలో ఊరేగింపు అమ్మవారి ఆలయ ప్రవేశం, 15న ఓకలి కార్యక్రమంతో అమ్మవారి జాతర ముగుస్తుందని తెలిపారు.



అలంకరణలో అమ్మవారు

తుమ్మల మారెమ్మకు ప్రత్యేక పూజలు

గుడిబండ, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలో వెలసిన తుమ్మల మారెమ్మ ఆలయంలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య శుక్రవారం సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేకపూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.



అలంకరణలో తుమ్మల మారెమ్మ

ఘనంగా భక్త పురందర దాస ఆరాధనోత్సవం



పురందరదాస చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

పెనుకొండ, ఫిబ్రవరి 9: వాగ్గేయకారుడు భక్త పురందరదాస ఆరాధనోత్సవాన్ని శుక్రవారం స్థానిక మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో నిర్వాహకులు పాలూరి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం మఠంలో అర్చకులు కుప్రేషాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పురందర దాస వేషధారణలో చిత్రపటం చేతబట్టి మహిళలు పురందర దాస కీర్తనలు ఆలపిస్తూ నగర సంకీర్తన గావించారు. అనంతరం బ్రాహ్మణ అన్నసంతర్పణ, సాయంత్రం పురందరదాస కీర్తనలను సంగీత కళాకారులు ఆలపించారు.

వర్షపు నీటిని ఒడిసి పట్టాలి



మాట్లాడుతున్న ఏపీ మాస్ డైరెక్టర్ గోపాల్‌రాజు

గుడిబండ, ఫిబ్రవరి 9: వర్షపు నీటిని ఒడిసిపట్టుకుని భూగర్భజలాలను పెంపొందించాలని ఏపీ మాస్ డైరెక్టర్ గోపాల్‌రాజు, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ నాగరాజు సూచించారు. గుడిబండలో ఏపీమాస్, వెలుగు ఆధ్వర్యంలో నీటి నిలువలపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కురిసిన వర్షపునీరు ఎంతో విలువైందన్నారు. రైతులు వేసవి కాలంలో ఆరుతడిపంటలు వేసుకోవాలని సూచించారు. కెనరాబ్యాంక్ మేనేజర్ లోకనాథ్‌రెడ్డి, ఏపీఓసీసీ దేవరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు

అగళి, ఫిబ్రవరి 9: స్థానిక మోడల్ పాఠశాలలో కస్తూర్బాలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు ఎంపీహెచ్‌డబ్ల్యూ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జాఫర్ తెలిపారు. పాఠశాలలోని 24 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన

అగళి, ఫిబ్రవరి 9: బాల్య వివాహాల నిర్మూలనపై ఆర్డీటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలం ఇనగలూరు గ్రామ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్‌డీటీ, మహిళా శిశు సంక్షేమశాఖ సంయుక్తంగా బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున, సీడీపీఓ నాగమల్లీశ్వరి, అగళి పంచాయతీ విస్తరణాధికారి పద్మ, ఆర్‌ఐ గుర్రన్న, ఏఎస్‌ఐ బషీర్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ బాలల హక్కులు, చిన్న వయసులోనే వివాహాలు చేస్తే జరిగే అనర్థాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఏటీఎల్ ఆదినారాయణ, ఉపాధ్యాయులు ముత్యాలమ్మ, మల్లేశప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి, రొళ్ల టీంలీడర్ ఓబులేసు, వైద్య సిబ్బంది గీత, సాకిబాయి, లక్కమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ నాగమల్లీశ్వరి

టీడీపీ పాలనలోనే బీసీలకు గుర్తింపు

● జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి



మాట్లాడుతున్న బీకే పార్థసారథి

పెనుకొండ, ఫిబ్రవరి 9: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి రాష్ట్రంలో బీసీలకు తగిన గుర్తింపు ఇచ్చిందని జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి అన్నారు. శుక్రవారం పెనుకొండ టీడీపీ కార్యాలయంలో బీకే ఆధ్వర్యంలో జిల్లా బీసీసెల్ అధ్యక్షులు కుంటిమద్ది రంగయ్య అధ్యక్షతన జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పరిశీలకుడు నరసింహరావు, జిల్లాపరిషత్ మాజీ చైర్మన్ పూల నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మునిమడుగు వెంకటరాముడు, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు కేశవయ్య హాజరయ్యారు. ముందుగా అంబేడ్కర్, జ్యోతిరావుపూలే చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం బీకే మాట్లాడుతూ అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ టీడీపీ అన్నారు. టీడీపీ పాలనలో పెనుకొండ నియోజకవర్గంతోపాటు రాష్ట్రం అభివృద్ధిబాటలో నడిచిందన్నారు. ఒక్క ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే జడ్పీ చైర్మన్‌గా లింగరాజు మొదలుకుని పూల నాగరాజు వరకు బీసీలకు పదవులు దక్కాయన్నారు. అనంతపురం హిందూపురం పార్లమెంట్ స్థానాలు కూడా బీసీలకు దక్కాయన్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులకు నీరు నింపిన ఘనత టీడీపీదేనన్నారు. కియ పరిశ్రమ తెచ్చిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. వైసీపీ పాలనలో కొత్త పరిశ్రమలు రావడం అటుంచి ఉన్న పరిశ్రమలు కూడా వేరే ప్రాంతాలకు తరలి వెళ్లాయన్నారు. అభివృద్ధికి మారుపేరు టీడీపీ పార్టీ అయితే అవినీతికి మారుపేరు వైసీపీ అన్నారు. వలస పక్షిగా వచ్చిన శంకర్‌నారాయణ పెనుకొండ ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా ఉండికూడా అభివృద్ధి పట్టించుకోలేదన్నారు. అందరూ కలిసికట్టుగా ఉండి పార్టీని గెలిపించి చంద్రబాబు నాయుడును మళ్లీ ముఖ్యమంత్రి చేయాలన్నారు. నాయకులు పాండురంగప్ప, నగర గోపాల్, కన్వీనర్లు సిద్దయ్య, నరహరి, రవిశంకర్, లక్ష్మీరెడ్డి, శివశంకర్, గాయిత్రి, జనసేన నాయకులు లోకేష్, చిన్నప్పయ్య, మాజీ సర్పంచ్ అశ్వర్థప్ప, రాంపురం సర్పంచ్ శ్రీనివాసులు, హుజూరుల్లాఖాన్, పాలడుగు చంద్ర పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను బైండోవర్ కేసుల్లో ఇరికించవద్దు



ఏఎస్‌ఐ దాదాపీర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 9: ఆటో డ్రైవర్లను బైండోవర్ కేసులో ఇరికించవద్దని సీపీఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు, ఆటో డ్రైవర్లు కలిసి స్టేషన్‌లో వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఆటో యూనియన్ సీఐటీయూసీలో అంతర్భాగమని, అలాంటి ఆటో డ్రైవర్లను సాధారణ ఎన్నికల దృష్ట్యా పోలీసులు ముందస్తు బైండోవర్లు చేస్తున్నారన్నారు. అమాయకులను బైండోవర్ చేయడం సరికాదని రౌడీషీటర్లు, ఇతర నేరాలకు పాల్పడేవారిపై కేసులు పెట్టాలని అన్నారు.

విద్యుత్ అక్రమ కనెక్షన్లపై దాడులు

చిలమత్తూరు, ఫిబ్రవరి 9: మండలంలో అక్రమ విద్యుత్ కనెక్షన్లపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. శుక్రవారం తిరుపతి, అనంతపురానికి చెందిన ప్రత్యేక బృందం సభ్యులు తనిఖీల్లో పాల్గొన్నారు. ప్రధానంగా మండల వ్యాప్తంగా లైన్‌మెన్లు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై అక్రమంగా అధికారుల అనుమతి లేకుండా ఏర్పాటుచేసిన విద్యుత్ కనెక్షన్లపై పక్కాగా తనిఖీలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిలమత్తూరు, పాతచామలపల్లి, కొత్తచామలపల్లి, బందేపల్లి, పలగలపల్లి గ్రామాల్లో పర్యటించి ఎక్కడెక్కడ అక్రమ కనక్షన్లు ఏర్పాటుచేశారో వాటిని గుర్తించినట్లు సమాచారం. అక్రమ కనక్షన్లపై నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తారని విద్యుత్ అధికారులు తెలిపారు.

పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలి

గుడిబండ, ఫిబ్రవరి 9: మండలంలోని మద్దనకుంట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. 2014 ఎన్నికల్లో మద్దనకుంట గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారని, 2019లో ఎత్తివేసి కేకే పాళ్యం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడి ఓటు హక్కును వినియోగించుకున్నామని వాపోయారు. జిల్లా ఎన్నికల కమిషన్ అధికారులు, ఉన్నతాధికారులు స్పందించి మద్దనకుంటలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని దేవరాజు, నాగరాజు, భీమణ్ణ, భీమరాజు, తిప్పేస్వామి, బూతరాజు, రాజప్ప, జగదీశ్, శంకరప్ప, నరసింహప్ప కోరారు.

బాలింతలకు కిట్ల పంపిణీ

పావగడ, ఫిబ్రవరి 9: సర్వధర్మశాంతి పీఠం అధ్యక్షుడు రామ్మూర్తి స్వామిజీ ప్రపంచ జనాభా నియంత్రణ సందర్భంగా శుక్రవారం జన్మించిన ఐదుగురు చిన్నారులకు బేబీ కిట్లను ప్రభుత్వ ఆస్పత్రిలో పంపిణీ చేశారు. ప్రపంచ జనాభాలోభారతదేశం మొదటి స్థా నంలో ఉండటం చూస్తుంటే రానున్న రోజుల్లో ఉద్యోగ అవకాశాలు, ఆర్థికపరమైన సమస్యలు రావచ్చని అన్నారు. ప్రతి కుటుంబం ఆనందంగా జీవించాలంటే ఒకరు లేక ఇద్దరు పిల్లలు తరువాత కుటుంబ నియంత్రణ చికిత్స చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సునీత, ఇతర వైద్యాధికారులు, నర్సులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

మడకశిర రూరల్ ఫిబ్రవరి 9: పరిశ్రమల కోసం రైతులు ఇచ్చిన సాగు భూములు రిఇగి ఇవ్వలంటూ 12వ తేదీన రైతు సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని భూ పోరాట సంఘం అధ్యక్షుడు సీఆర్ వెంకటరెడ్డి శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు నెలకొల్పుతామని సీ కోడిగేపల్లి, పరిగి పంచాయతీల పరిధిలో 12 గ్రామాల్లో 2200 ఏకరాల సాగుభూములను రైతుల నుంచి కారుచౌకతో తీసుకున్నారన్నారు. భూములు ఇచ్చిన రైతులకు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని ఆశ చూపారన్నారు. భూములు తీసుకుని 16 ఏళ్లయినా పరిశ్రమలు స్థాపించకపోవడంతో రైతులు ఇచ్చిన భూములను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రతి విద్యార్థి సేవాగుణాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ

గోరంట్ల, ఫిబ్రవరి 9: చిన్న వయసు నుంచే విద్యార్థుల్లో ఇతరులకు సాయపడే విధంగా సేవాగుణం అలవాటు చేసుకోవాలని ఏఎన్‌కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కెంపుల లక్ష్మీనారాయణ సూచించారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేకశిబిరం ప్రారంభ కార్యక్రమంలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. వారంరోజులపాటు విద్యార్థులు పరిశుభ్రత, అక్షరాస్యత, ఆరోగ్యం, మొక్కలు నాటడం తదితర కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, శ్రమదానం చేయాలన్నారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అడవాల సూర్యనారాయణ, శ్రీనివాసులు, పీఓ జయప్రకాష్, అధ్యాపకులు సుధాకర్, ఆదినారాయణ, నరసింహప్ప, బాబు, హెల్త్ అసిస్టెంట్ గాయత్రి పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ వ్యక్తి పీవీ

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 9: భారతదేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని పలువురు కొనియాడారు. ఆయనకు దేశ అత్యున్నత భారతరత్న పురస్కారం ప్రకటించడం తెలుగుజాతికే గర్వకారణమన్నారు. ఆర్థిక సంస్కరణలతో దేశాభివృద్ధికి పాటుపడిన మహోన్నతుడు పీవీ నరసింహారావు అన్నారు. మునిసిపల్ మాజీ చైర్మన్ బీఎస్ విద్యాసాగర్ మాట్లాడుతూ... పీవీ 17 భాషలను అనర్గళంగా మాట్లాడేవారన్నారు. అందుకే ఆయనకు బహుభాషాకోవిదుడిగా పేరుందన్నారు. బీజేపీ నాయకుడు రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. భారతరత్న పురసాకరం తెలుగువారికి దక్కడం గర్వించదగ్గ విషయమన్నారు.

అగళి తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు

అగళి, ఫిబ్రవరి 9: అగళి తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు నియమితులైనట్లు డీటీ సుబ్బారావు తెలిపారు. మడకశిరలో పనిచేస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లును ఇక్కడికి బదిలీచేసినట్లు తెలిపారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ జమానుల్లాఖాన్ ఎన్నికల బదిలీల్లో భాగంగా కర్నూలుకు బదిలీ అయ్యారు.

మడకశిర తహసీల్దార్‌గా ప్రకాష్‌బాబు

మడకశిరటౌన్: మడకశిర తహసీల్దార్‌గా ప్రకాష్‌బాబును నియమిస్తూ శుక్రవారం ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. వారం రోజుల క్రితం తహసీల్దార్ వెంకటేష్‌బాబును నియమించంగా బాధ్యతలు స్వీకరించలేదు. కర్నూల్ జిల్లా నంద్యాల నుంచి ప్రకాష్‌బాబును ఇక్కడ నియమించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 9: పట్టణ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈఈ నారాయణ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ లైన్‌లో మరమ్మతుల కారణంగా శాంతినగర్, త్యాగరాజనగర్, గుడ్డం, చైతన్యనగర్, సాయినగర్, పోలీస్ క్వార్టర్స్, ఆర్టీసీ కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వాహనాలకు రికార్డులు తప్పనిసరి

అగళి, ఫిబ్రవరి 9: వాహనాలకు రికార్డులు తప్పనిసరి అని ఎస్‌ఐ వీరేష్ అన్నారు. మండలంలోని పి బ్యాడిగెర చెక్‌పోస్టు వద్ద ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల సమీపిస్తుండటంతో కర్ణాటక నుంచి ఆంధ్రకు అక్రమ మద్యం తరలించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామనానరు. అసాంఘిక కార్యకలాపాలు, జూదం, మట్కా, నాటుసారా, దొంగతనాలు తదితర వాటికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ వీరేష్

తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపడం బాధాకరం

పావగడ, ఫిబ్రవరి 9: తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తు కోసం జీవితాంతం కష్టపడి ప్రయోజకుల్ని చేస్తే వారు రూ.లక్షలు ఇచ్చి వృద్ధాశ్రమాల్లో చేర్పడం బాధాకరమని పావగడ ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఎస్ఎస్‌కే సముదాయ భవన్‌లో నిర్వహించిన విశ్వజనసంఖ్య నియంత్రణ దినోత్సవ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల 18 సంవత్సరాలలోపే ప్రేమ పెళ్లి అని యువతీయువకులు అనారోగ్య సమస్యల్లో పడుతున్నారన్నారు. వారికి ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పెళ్లి, గర్భం దాల్చడంపై అవగాహన కల్పించాలన్నారు. ఒకప్పటి ప్రపంచ జనాభా 400 కోట్లలో ఉండేదని, నేడుప్రపంచంలోనే భారతదేశ జనాభా చైనా దేశాన్ని మించి మొదటిస్థానంలో నిలిచిందన్నారు. ప్రస్తుత ప్రపంచ జనాభా 800 కోట్లకుపైగా ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపిందన్నారు. ఒక కుటుంబానికి ఇద్దరు పిల్లలు అయితే చాలని సీహెచ్‌ఓ తిరుపతయ్య తెలిపారు. సీడీపీఓ సునీత, కౌన్సిలర్ రవి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

నులిపురుగుల నిర్మూలనతోనే ఆరోగ్యం

చిలమత్తూరు, ఫిబ్రవరి 9: నులిపురుగలను నివారిస్తేనే ఆరోగ్యంగా ఉండగలమని వైద్యులు హర్షమిత్ర అన్నారు. శుక్రవారం అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. ఏడాది నుంచి 19 ఏళ్ల వయసుగల ప్రతి ఒక్కరు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని ఆమె సూచించారు. ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి 9804 మంది పిల్లలను లక్ష్యంగా పెట్టుకోగా మొదటి రోజున 9324 మందికి అందజేశామన్నారు.

పెనుకొండ: స్థానిక పరిటాల శ్రీరాములు డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ నులిపురుగల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు చెన్నారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో రక్తహీనతకు అనారోగ్యానికి కారణమయ్యే నులిపురుగులను అరికట్టేందుకు ఆల్బెండజోల్ మాత్రలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అధ్యాపకులు ప్రతాప్, చంద్రమోహన్, నందిని, మంగాపురం వలంటీరు నాగమణి, ఎన్ఎస్ఎస్ పీఓ రంగనాయకులు పాల్గొన్నారు.

గోరంట్ల: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గోరంట్ల, కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యులు 11,789 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను శుక్రవారం మింగిచారు. డాక్టర్ శృతి, డాక్టర్ వాసు ఆధ్వర్యంలో మండలంలోని 12 సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలో నులిపురుగుల నివారణ చర్యలు చేపట్టారు.

మడకశిర రూరల్: విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి సూచించారు. శనివారం మండలంలోని గౌడనహళ్ళి ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కల్లుమర్రి పీహెచ్‌సీ డాక్టర్లు మాధుర్య, వినోద్‌కుమార్, సూపర్‌వైజర్ రాంప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.



గోరంట్లలో చిన్నారికి మాత్ర వేస్తున్న వైద్యాధికారి శృతి

ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చిలమత్తూరు, ఫిబ్రవరి 9: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని హిందూపురం పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ ఎ.వి. రమణమూర్తి అన్నారు. శుక్రవారం ఆయన చిలమత్తూరు మండల నాయకులతో కలిసి పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా కోడూరు గ్రామంలో పర్యటించి ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు కార్యక్రమంలో శ్రీనివాసులు, హరిప్రసాద్ రెడ్డి, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

గోరంట్ల: పల్లెకు పోదాం అభియాన్‌లో భాగంగా మండలంలోని పాలసముద్రంలో బీజేపీ నాయకులు శుక్రవారం సమావేశం నిర్వహించారు. గ్రామంలోని 192, 193 పోలింగ్ కేంద్రాల్లో మహిళా సమావేశం ఏర్పాటు చేసి, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమపథకాలను వివరించారు. మేదర శ్రీనివాసులు, శంకర్, రామాంజనమ్మ, నాగలక్ష్మి, స్వప్న పాల్గొన్నారు.

బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతం చేద్దాం



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 9: ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు వివరించి గ్రామస్థాయిలో బీజేపీని బలోపేతం చేద్దామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రామక్రిష్ణ పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి పిలుపుమేరకు జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ ఆధ్వర్యంలో పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పల్లె పల్లెకు బీజేపీ కార్యక్రమం పోస్టర్లను విడుదల చేశారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త కృషిచేయాలన్నారు. అంగడి రామాంజనేయులు, హనుమంతుయాదవ్, సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమను కాపాడుకోవడమే ధ్యేయం



మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకుడు

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 9: రోజు రోజుకు కనుమరుగవుతున్న చేనేత పరిశ్రమను కాపాడుకోవడమే ధ్యేయమని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లల మర్రి నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం సోమందేపల్లిలోని కళ్యాణమండపంలో చేనేతసంఘం జిల్లా మహాసభ నిర్వహించారు. ఏపీ చేనేత కార్మిక సంఘం మాజీ కార్యదర్శి జింకా చలపతి, రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, ఆంజనేయులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ 11రకాల చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని చేనేత అడ్వైజర్ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. చేనేతపై జీఎస్టీ రద్దు చేయాలని, ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మిక కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, బ్యాంక్ రుణాలు మాఫీ చేయాలన్నారు. మండల కార్యదర్శి బాలస్వామి, అంజనేయులు, జేవీ రమణ, వినోద్ పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న బహుజన చైతన్యవేదిక అధ్యక్షుడు శివరాంక్రిష్ణ

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 9: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 11న నిర్వహించే సామాజిక ఐక్యత మహాసభను విజయవంతం చేద్దామని బహుజన చైతన్యవేదిక అధ్యక్షుడు శివరాంక్రిష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బడుగులను చైతన్యపరిచేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. బహుజనులపై దాడులు, అత్యాచారాలు అధికమయ్యాయన్నారు. మహాసభకు రిటైర్డ్ న్యాయాధికారి క్రిష్ణప్ప, డిప్యూటీ డైరెక్టర్ సోషల్ వెల్ఫేర్ శివరంగప్రసాద్, మాజీ ప్రిన్సిపాల్, చీఫ్ కమర్షియల్ మేనేజర్, ఎస్సీ రైల్వేస్ డా. అప్పికట్ల భరత్‌భూషణ్ తదితరులు వస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశులు, నరసింహులు, రవి, రామాంజి, కదిరప్ప, నరసింహులు, హనుమంతు పాల్గొన్నారు.

బాలుడిని వదిలివెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు

పావగడ, ఫిబ్రవరి 9: స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏడాదిన్నర బాలుడిని గుర్తుతెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి వదిలి వెళ్లినట్లు టీహెచ్‌ఓ తిరుపతయ్య తెలిపారు. బాలుడిని స్వాధీనం చేసుకొన్న వైద్యాధికారులు అన్ని పరీక్షలు చేసిన అనంతరం బాలుడికి పుట్టుకతోనే వెన్నెముక దెబ్బతినడంతో పెద్దయ్యాక కూడా నడిచే పరిస్థితి లేనందువల్ల తల్లిదండ్రులు వదిలి వెళ్లి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం తుమకూరు పిల్లల సాంత్వన కేంద్రానికి బాలుడిని తరలించినట్లు తిరుపతయ్య తెలిపారు. బాలుడిది సమీపంలోని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రొద్దం, లేక పెనుకొండ ప్రాంతానికి చెందిన వ్యక్తులు వదిలి వెళ్లి ఉండవచ్చని పోలీసులు తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

కర్ణాటక పోలీసుల సోదాలు

రొద్దం, ఫిబ్రవరి 9: కర్ణాటక ప్రాంతంలో బైక్, కారు చోరీ కావడంతో ఆ రాష్ట్ర పోలీసులు రొద్దంలో సోదాలు నిర్వహించారు. గురువారం రాత్రి బెంగళూరు నుంచి పోలీసులు వచ్చి దొంగతనం కేసులో పట్టుబడ్డ పెనుకొండకు చెందిన ఓ వ్యక్తిద్వారా రొద్దంలో ఉన్నాయని సమాచారం రావడంతో సోదాలు నిర్వహించినట్లు తెలిసింది. ఈ మేరకు రొద్దంలో ఓ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకోగా కారు కోసం గాలిస్తున్నారు. ఆ వ్యక్తి పరారీలో ఉండగా వెనుతిరిగినట్లు తెలిసింది. 10 ద్విచక్రవాహనాలను పెనుకొండకు చెందిన ఓ వ్యక్తి రొద్దంలో అమ్మినట్లు సమాచారం.

పాఠశాలలో వంటపాత్రలు చోరీ

లేపాక్షి, ఫిబ్రవరి 9: చోళసముద్రం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండటానికి ఉపయోగించే వంటపాత్రలను గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీ చేసినట్లు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ తెలిపారు. వంట గది తాళాలు పగలకొట్టి చోరీ చేసినట్లు గుర్తించామన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వీటి విలువ రూ.25వేలు ఉంటుందన్నారు. విచారణ చేసి నిందితులను త్వరలో పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఫిబ్రవరి 9: మండలంలోని శెట్టిచిన్నంపల్లికి చెందిన బయపరెడ్డి కుమారుడు చెన్నకేశవరెడ్డి విషద్రావకం తాగి శుక్రవారం ఆత్మహత్యకు యత్నించాడు. మందును కూల్‌డ్రింక్‌లో తాగిడంతో అస్వస్థతకు గురయ్యాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు.

విద్యుదాఘాతంతో మహిళకు అస్వస్థత

గోరంట్ల, ఫిబ్రవరి 9: మండలంలోని చింతలపల్లికి చెందిన ప్రభావతి అనే మహిళ విద్యుత్ షాక్ గురై శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. చింతలపల్లికి చెందిన సుబ్రమణ్యంభార్య ప్రభావతి ఇంట్లో బట్టలు ఉతుకుతూ తడి చేతులతో స్విచ్‌బోర్డును తాకగడంతో షాక్‌కు గురయ్యారు. ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, మెరుగైన వైద్యం హిందూపురం తరలించారు.